సాక్షి ప్రకాశం

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



అటవీపుత్రుల ఆకలి పోరాటం

గిద్దలూరు మండలం దిగువమెట్ట తండాలో ప్రభుత్వ అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన కొందరు పెద్దలు గిరిజనులకు చెందిన భూముల్లోకి వారిని రానీయడం లేదు. - 8లో..



మహిర్ క్షేమం

ఒంగోలులో కిడ్నాపైన బాలుడు మహిర్‌ని గంటల వ్యవధిలోనే పోలీసులు తల్లి ఒడికి చేర్చారు. ఎస్పీ దామోదర్ వివరాలు వెల్లడించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 29/21

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు ఆర్చరీ సబ్ జూనియర్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఆర్చరీ సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రామకృష్ణారావు, పి.లెమ్యూల్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2007 జనవరి 1వ తేదీ తరువాత పుట్టిన వారు మాత్రమే ఎంపికకు అర్హులని, ఎంపిక ఉదయం 10 గంటలకు స్థానిక ఏబీయం డిగ్రీ కాలేజీ ఆవరణలో జరుగుతుంది. ఎంపికైన క్రీడాకారులు త్వరలో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. ఆసక్తిగల క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం, మూడు పాస్‌పోర్టుసైజు ఫొటోలతో ఎంపికకు నేరుగా హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్‌నంబర్ 9652241641 ను సంప్రదించాలన్నారు.

నేడు జిల్లా స్థాయి జూడో క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: జూడో జిల్లా స్థాయి స్త్రీ, పురుష క్రీడాకారుల ఎంపిక స్థానిక మామిడిపాలెం ఒకటో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద ఉన్న యోగా సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ఖాజామస్తాన్, ఎ.రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. ఆసక్తిగల క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్ వెంట తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన స్త్రీ, పురుషులు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9948877412ని సంప్రదించాలన్నారు.

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: పరిశ్రమలు, వ్యవసాయం అనుబంధ రంగాలను బలోపేతం చేయడంతో జిల్లాను సమగ్ర అభివృద్ధి పథంలో నడిపేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లాకు సంబంధించి రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను ప్రదర్శించామని దానికి సంబంధించిన వివరాలను తెలిపారు. పరిశ్రమలు, ఆక్వా కల్చర్, పాడి పరిశ్రమ, వ్యవసాయం, గోదాములు, ఇరిగేషన్, విద్య, పర్యాటకం, నైపుణ్యాభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగాలకు సంబంధించి జిల్లాలోని వనరులు అభివృద్ధి చేసేందుకు కావాల్సిన అంశాలు, అవకాశాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించినట్లు పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో 8 వేలకు పైగా కేసుల పరిష్కారం

ఒంగోలు: దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 8 వేలకుపైగా కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన వివిధ బెంచీలకు పెద్ద ఎత్తున కక్షిదారులు హాజరై రాజీమార్గమే రాజమార్గంగా భావించి కేసులు రాజీచేసుకున్నారు. రాజీకి అర్హత కలిగిన క్రిమినల్ కేసులు, వాహన ప్రమాద బీమా పరిహారపు చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, సివిల్ కేసుల్లో ఈ రాజీలు జరిగాయి. రాజీ చేసుకున్న కేసుల్లో కక్షిదారులు కోర్టుకు చెల్లించిన ఫీజు కూడా వాపసు చేశారని, ఈ కేసుల పరిష్కారానికి సహకరించిన బీమా సంస్థలు, పోలీసుశాఖ వారు బ్యాంకులకు సహకరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.

స్త్రీనిధి రుణాల దుర్వినియోగంపై క్రమశిక్షణ చర్యలు



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

ఒంగోలు వన్‌టౌన్: స్త్రీ నిధి రుణాల దుర్వినియోగం పై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది, అధికారులతో శనివారం వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్చువల్ పద్ధతిలో స్త్రీనిధి 18వ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి విజన్ 2047ను అనుసంధానం చేసుకుని ప్రతి మహిళ ఒక లక్షాధికారిగా ఎదగాలన్నారు. నిధుల వినియోగంపై ప్రతి స్థాయిలో పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న సీఈఓ వీర పాండ్యన్ ఎజెండాలోని అంశాలను సభ్యులకు తెలిపి ఆమోదం తీసుకున్నారు. సమావేశంలో జిల్లా సమాఖ్య అధ్యక్షులు గోవిందమ్మ, స్త్రీనిధి మేనేజర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

అడ్డగింతలు.. అక్రమాలు

సాగునీటి సంఘాల ఎన్నికలు కూటమి నేతల దౌర్జన్యానికి, అధికార దుర్వినియోగానికి పరాకాష్టగా నిలిచాయి. అధికారులను, పోలీసులను అడ్డుపెట్టుకుని తాము అనుకున్న వారే ఏకగ్రీవమయ్యేలా ఎక్కడికక్కడ టీడీపీ నాయకులు అక్రమాలకు తెగబడ్డారు. నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా, అక్రమ అరెస్టులతో అసలు నామినేషన్లే వేయనీయకుండా అడ్డుపడ్డారు. కూటమి దాష్టీకాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించింది. గ్రామ స్థాయిలో జరిగిన ఎన్నికలతో టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరింది.

- అడ్డగోలుగా సాగునీటి సంఘాల ఎన్నికలు
- కూటమి నేతలకు అధికారుల దాసోహం
- ఏకగ్రీవం మాటున అన్నీ అక్రమాలే
- ఆశావహులకు నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా తిప్పలు పెట్టిన అధికారులు
- ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధపడిన ఆరుగురు రైతులు తెల్లవారుజామున అక్రమంగా అరెస్టు
- యర్రగొండపాలెం టీడీపీ రెబల్ అభ్యర్థిపై అధికారుల జులుం
- అధికారుల తీరుకు నిరసనగా బేస్తవారిపేట మండలం జేబీకే పురంలో ఆందోళనలు
- కొండపి నియోజకవర్గ టీడీపీలో చిచ్చు రేపిన ఎన్నికలు



అచ్చంపేటలో నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వకుండా జాప్యం చేసిన వీఆర్వోను సస్పెండ్ చేయాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ఒంగోలు సిటీ: సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని కూటమి నేతలు అడ్డగోలుగా వ్యవహరించారు. ఏకగ్రీవం మాటున అక్రమాలకు పాల్పడ్డారు. అధికారులు సైతం అధికార పార్టీ నేతలకు దాసోహం అంటూ నిబంధనలను గాలికొదిలేశారు. చాలా ప్రాంతాల్లో ప్రతిపక్షపార్టీల, అధికార టీడీపీ రెబల్ అభ్యర్థులకు నో డ్యూస్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు అధికారులు చుక్కలు చూపించారు. ఈ ఎన్నికల్లో కూటమి నేతల అక్రమాలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ బహిష్కరించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలపై పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. జిల్లాలో మొత్తం 342 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా 339 ఏకగ్రీవమయ్యాయి.

టీడీపీ వర్గాల మధ్య ఆధిపత్య పోరు...

కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి, కొండపి, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ఈ మండలాల్లో టీడీపీలోని వర్గాల మధ్య ఆధిపత్య పోరు తార స్థాయికి చేరింది. మర్రిపూడి మండలంలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, మాజీ జెడ్పీటీసీ తుళ్లూరు నరసింహారావు, రేగుల వీరనారాయణ వర్గాల మధ్య ఆధిపత్య పోరు సాగింది. ఈ పోరులో మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అండదండలతో చేరెడ్డి నర్సారెడ్డి తన వర్గాన్ని ఏకగ్రీవంగా గెలిపించుకున్నారు. కొండపి మండలంలో మానకొండ వెంకటేశ్వర్లు, ముప్పరాజు గోపాల్ వర్గాల మధ్య రెండున్నర సంవత్సరాలు ఒకవర్గం, మరొక వర్గం రెండున్నర సంవత్సరం చేసేటట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. సింగరాయకొండ మండలంలో బింగినపల్లి సాగునీటి సంఘానికి జరిగిన ఎన్నికల్లో సన్నెబోయిన మాలకొండయ్య వర్గానికి దామచర్ల సత్య, మంత్రి స్వామి మద్దతు పలుకగా, టూరిజం బోర్డు కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ.. టీడీపీ నాయకుడు పులి ప్రసాద్ వర్గానికి మద్దతు పలికారు. చివరకు పులిప్రసాద్ వర్గం మంత్రి స్వామి ఆదేశాలతో ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో మాలకొండయ్య వర్గం ఏకగ్రీవం అయ్యింది. జరుగుమల్లి మండలంలో కె.బిట్రగుంట పంచాయతీలో టీడీపీలో యర్రా కిరణ్, వట్టిగుంట శివాజీ వర్గాల పోటీ పడగా అధిష్టానం ఆదేశాలతో యర్రా కిరణ్ వర్గం ఏకగ్రీవం అయింది.

- మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు రెవెన్యూ సిబ్బంది శుక్రవారం అర్ధరాత్రి వరకు నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు.

తెల్లవారుజామున అక్రమ అరెస్టు:



కొమరోలులో పోలీసుస్టేషన్ వద్ద తెల్లవారుజామున గుమిగూడిన రైతులు

కొమరోలు: నీటి సంఘం ఎన్నికల్లో ఓడిపోతారనే భయంతో టీడీపీ వర్గీయులు రైతులపై అక్రమ కేసులు పెట్టారు. తాటిచెర్ల చెరువు నీటి సంఘం ఎన్నికలు శనివారం తాటిచెర్ల గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పోలీసులు మండలంలోని తాటిచెర్ల గ్రామానికి చేరుకుని ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమైన తాటిచెర్ల గ్రామానికి చెందిన మూల పెద్దవెంకటరెడ్డి, మూల చిన్నవెంకటరెడ్డి, మూల శేషిరెడ్డి, బొమ్మిని వెంకటేశ్వర్లు, బోగోలు చిన్న పుల్లయ్యలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నీటి సంఘం ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్న రైతులు అరెస్టయిన విషయం తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కామూరి రమణరెడ్డి, తాటిచెర్ల మాజీ సర్పంచ్ బాదం వేణుగోపాల్‌తో కలిసి తెల్లవారుజామున పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. 9 గంటల వరకు అక్కడే ఉండి రైతులతో మాట్లాడారు. స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లునాయక్‌తో మాట్లాడగా ఓ మహిళను బెదిరించిన కేసులో ఆ ఆరుగురిని అరెస్టు చేసినట్లుగా పేర్కొన్నారు. పోటీ చేయాలనుకున్న ఆరుగురు అభ్యర్థులను అరెస్టు చేసి నామినేషన్ల ఘట్టం ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2 గంటల తరువాత వారిని పోలీసులు విడిచిపెట్టారు. నామినేషన్ల పర్వం అప్పటికే ముగిసిపోయింది. అక్రమ అరెస్టులతో టీడీపీ వర్గీయులు మాత్రమే నామినేషన్ ఘట్టంలో పాల్గొన్నారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.

ఈ సందర్భంగా కామూరి రమణరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో జరుగుతున్న నీటి సంఘం ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు ఓడిపోతారనే భయంతో తప్పుడు కేసులు పెట్టించి అక్రమ అరెస్టులు చేయించారని ఆరోపించారు. ఇలాంటి అరెస్టులు ప్రజాస్వామ్య బద్ధంగా లేవని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించి నిద్రమత్తులో ఉన్న రైతులను బలవంతంగా తీసుకొచ్చారని మండిపడ్డారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గంగిపోగు అలెగ్జాండర్, వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్మిని వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. అనంతరం కొమరోలు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు పోలీసుస్టేషన్‌కు చేరుకుని వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఈసంఘటనపై మాట్లాడారు.

ఎమ్మార్వో డౌన్..డౌన్

బేస్తవారిపేట: ఎమ్మార్వో జితేంద్ర డౌన్‌డౌన్ అంటూ సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో ఓటర్లు, గ్రామస్తులు, సర్పంచ్ వెంకట లక్ష్మమ్మ ఆందోళన వ్యక్తం చేసిన సంఘటన జేబీకే పురంలో శనివారం జరిగింది. నీటి సంఘం ఎన్నికల్లో పాల్గొనాలనుకునే వారికి రెండు రోజులుగా తిరుగుతున్నా వీఆర్వో నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వలేదు. ఉదయం ఎలక్షన్ జరిగే సమయంలో తహసీల్దార్ జితేంద్రకుమార్ కారులో వీఆర్వో వచ్చాడు. అక్కడి నుంచి ఎటోవెళ్లి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దీనిపై ఆగ్రహించిన గ్రామస్తులు వీఆర్వోను ఎక్కడికి పంపారని, ఇంత అన్యాయంగా ఎన్నికలు నిర్వహించడమేంటని, ఎన్నికల అధికారిగా ఉన్న ఎమ్మార్వో సమాధానం చెప్పాలని ఆందోళన చేపట్టారు. న్యాయం చేయకపోతే బయటకు వెళ్లనివ్వమంటూ..ఎమ్మార్వో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.



జేబీకే పురంలో ఎమ్మార్వో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

- ఖాజీపురం, అర్ధవీడు మండలం బొల్లుపల్లె నాయునిచెరువు, అచ్చంపేట తిమ్మనచెరువు సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో పాల్గొనేందుకు ఆశావహులు నో డ్యూ సర్టిఫికెట్ కోసం రెండు రోజులుగా తిరుగుతున్నా ఇవ్వలేదు. శనివారం వీఆర్వోలు ఫోన్ స్విచ్ఆఫ్ చేసుకున్నారు. దీంతో బొల్లుపల్లె నాయునిచెరువులో పోటీ చేయడం కోసం అక్కడకు వచ్చిన రైతులు ఎలక్షన్ జరుగుతుంటే అందుబాటులో లేకుండాపోయిన వీఆర్వోను సస్పెండ్ చేయాలని నిరసన వ్యక్తం చేశారు.
- దొనకొండ మండలం రుద్రసముద్రం గ్రామంలోనీటి సంఘ ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల కోసం కూటమి నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు దిగారు.

కూటమి నాయకుడు చెప్పినట్లే నీటి సంఘాలు ఏకగ్రీవం

యర్రగొండపాలెం: నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి. కూటమి నాయకుడు చెప్పినట్లే అధికారులు తలలుఊపి నీటి సంఘాలను పచ్చనేతలకు ఏకగ్రీవంగా కట్టబెట్టారు. నియోజకవర్గంలో సాగర్ ఆయకట్టు సంఘాలను కలుపుకొని మొత్తం 51 నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆయా మండలాల తహసీల్దార్లు, పోలీసులు అత్యుత్సాహం చూపారు. తమ ప్రాంతంలోని నీటి వినియోగదారుల సంఘాలకు పోటీపడేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గీయులు దూరంగా ఉన్నా టీడీపీ వర్గీయులు మాత్రం ఉత్సాహం చూపారు. వారికి మద్దతుగా సకాలంలో నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు తిప్పుకున్నారు. పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించి ఇతరులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ కారణాలతో నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ వర్గీయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నామినేషన్ వేయటానికి వెళ్తే పోలీసులు అడ్డుకున్నారు

యర్రగొండపాలెం: నామినేషన్ వేయటానికి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రం వద్దకు వెళ్తే పోలీసులు అడ్డుకున్నారని యర్రగొండపాలెం మండలంలోని మురారిపల్లె గ్రామానికి చెందిన తెలుగు రైతు నాయకుడు పోతిరెడ్డి రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. మురారిపల్లె చెరువు కింద దాదాపు 500 మంది రైతు సభ్యులు ఉన్నారు. వీరిలో 400 మంది సభ్యులు రమణారెడ్డివైపు మొగ్గుచూపుతున్నారు. ఆయన డాక్టర్ మన్నె రవీంద్ర వర్గానికి చెందినవాడు కావడంతో నియోజకవర్గ టీడీపీ నాయకుడు గూడూరి ఎరిక్షన్‌బాబు అతనిని దూరంపెట్టి ఆ గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డిని గెలిపించాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించాడు. నామినేషన్ సమయం దాటేవరకు రమణారెడ్డిని గేటువద్దనే పోలీసులు నిలబెట్టి కాలయాపన చేశారు. నామినేషన్ వేయటానికి లోపలికి వెళ్తే అక్రమ కేసులు బనాయించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. నామినేషన్ వేయకుండా పోలీసులు అడ్డుకోవడంతో రమణారెడ్డి తన నామినేషన్ ఫారాలను చించి వేశాడు.



మురారిపల్లెలో నామినేషన్ వేయటానికి రానీయకపోవడంతో నామినేషన్ పత్రాలను చించేస్తున్న టీడీపీ రెబల్ అభ్యర్థి రమణారెడ్డి

నా సంతకం చెల్లదు..

నో డ్యూ సర్టిఫికెట్ జారీచేసిన యర్రగొండపాలెం తహసీల్దార్ బాలకిషోర్ తిరిగి ఆ సర్టిఫికెట్టును వెనక్కు తీసుకున్నారు. ఇదేమిటని అడిగితే ఆ సర్టిఫికెట్‌పై నేను పెట్టిన సంతకం చెల్లదని గదమాయించారు. యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల గ్రామ నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో పోటీ చేసుందుకు టీడీపీ వర్గానికి చెందిన సింగవరపు బ్రహ్మనాయుడు సన్నద్ధం అయ్యాడు. అందుకుగాను ఆయనకు నో డ్యూ సర్టిఫికెట్ కోసం రోజులతరబడి తిరిగినా ఫలితం లేకుండా పోయింది. బ్రహ్మనాయుడు గ్రామంలో బలమైన నాయకుడు కావడంతో ఆయనకు శుక్రవారం రాత్రి తహసీల్దార్ నో డ్యూ సర్టిఫికెట్ జారీచేశారు. ఈ విషయం తెలుసుకున్న కూటమి నాయకుడు తహసీల్దార్‌పై కన్నెర్ర చేసినట్లుందేమో... రాత్రి 11 గంటల ప్రాంతంలో ఆ సర్టిఫికెట్‌ను వెనక్కు తీసుకున్నారు. ఈ విషయాన్ని ముందుగా పసిగట్టిన బ్రహ్మనాయుడి వర్గానికి చెందిన వారు ఆ సర్టిఫికెట్‌ను జిరాక్స్ చేసుకొని తహసీల్దార్‌కు అందచేశారు. ఆయన మరో ఫారం ఇచ్చి గ్రామ వీఆర్వో వద్ద సంతకం పెట్టించుకొని రండని పురమాయించారు. జరిగిన పరిస్థితుల గురించి ప్రశ్నించిన వారికి నో డ్యూ సర్టిఫికెట్‌పై పెట్టిన తన సంతకం చెల్లదని బదులిచ్చాడని బ్రహ్మనాయుడు తెలిపాడు. ముందుగా తీసిపెట్టుకున్న జిరాక్స్ కాపీలతో వారు నామినేషన్ వేశారు. ఆ తరువాత వారిని పోలీసులు బయటకు పంపి తిరిగి ఎన్నికల కేంద్రంలోకి అనుమతించలేదు. కూటమి నాయకుడి అండతో కొలుకుల గ్రామానికి చెందిన కర్రె నాసరమ్మ నీటి సంఘం అధ్యక్షురాలిగా పోటీచేసేందుకు సన్నద్ధమైంది. నాసరమ్మ మరిది కొలుకులకు చెందిన కర్రె బాలేశ్వరరావు మండలంలోని గంగపాలెం గ్రామ వీఆర్వో. ఆయనతో పాటు ఇతర ప్రాంతంలో గ్రామ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మిని తన సొంత గ్రామానికి చెందిన కొలుకులలో జరుగుతున్న ఎన్నికలకు డ్యూటీ వేశారు. స్వగ్రామానికి చెందిన వారిని ఏ విధంగా ఎన్నికల డ్యూటీ వేశారని ఆ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత బయలుదేరిన తహసీల్దార్ కారును గ్రామస్తులు అడ్డుకున్నారు. తహసీల్దార్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు వారిని సెల్‌ఫోన్లలో వీడియో తీసి బెదిరించారు.



కొలుకులలో ఎన్నికలు ముగిసిన తరువాత ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

శివానీ..భవానీ



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న అమ్మవారి భక్తులు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారి నగరోత్సవం
- వేలాదిగా పాల్గొన్న భవానీ మాలధారులు

చీమకుర్తి: స్థానిక సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలోని కనకదుర్గమ్మ అమ్మ వారి నగరోత్సవం శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. భవానీ మాలను ధరించిన భక్తులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి 516 కలశాల ద్వారా గాంధీనగర్‌లోని కోదండరామస్వామి ఆలయం నుంచిపవిత్ర జలాలను అమ్మవారిని సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు ఊరేగించుకుంటూ వచ్చారు. అనంతరం అమ్మవారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా అభిషేకాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి సూది వెంకట్రావు, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



ఊరేగింపుగా అమ్మవారి భక్తులు

జర్నలిస్టులపై దాడి హేయం

- దాడి ఘటనపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి
- ఏపీయూడబ్ల్యూజే, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ డిమాండ్
- ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు వినతి పత్రం అందజేసిన జర్నలిస్టు నాయకులు



ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందులలో వార్తలను సేకరించడానికి వెళ్లిన 'సాక్షి' దినపత్రిక, మీడియా ప్రతినిధులపై అమానుషంగా దాడి చేయడాన్ని ఏపీయూడబ్ల్యూజే, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ తీవ్రంగా ఖండించాయి. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కలిసి జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎన్‌వీ రమణ, డి.కనకయ్య మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా వ్యవహరించే పత్రికా వ్యవస్థపైన దాడులు జరగడం హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. పులివెందులలో 'సాక్షి' ప్రతినిధుల మీద దాడికి పాల్పడిన ఘటనతో పాటుగా ఇటీవల హైదరాబాద్‌లో టీవీ 9, సుమన్ టీవీల ప్రతినిధులపై దాడి చేయడం దారుణమని అన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు తగిన భద్రత కల్పిస్తామని చెప్పారు. ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.సురేష్, స్వతంత్ర శ్రీనివాసరావు, ప్రైమ్ 9 శ్రీనివాసరావు, 'సాక్షి' విలేకరులు పి.శ్రీనివాసరావు, ఎస్‌డీ.సాబీర్ హుస్సేన్, ఎం.రామకృష్ణ, జె.సువర్ణరాజు, పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

- సీపీఎం జిల్లా మహాసభల్లో రెండోరోజు సమావేశంలో తీర్మానం

చీమకుర్తి: జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం ప్రతినిధులు తీర్మానించారు. చీమకుర్తిలో శనివారం రెండోరోజు సీపీఎం ప్రతినిధులతో జరుగుతున్న జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు గతంలో ఆయన పరిపాలించిన విధానాలనే మళ్లీ అమలు చేస్తున్నాడు తప్ప కూటమి ప్రభుత్వ విధానాల్లో నూతనత్వం లేదన్నారు. దేశంలో ధరలు, నిరుద్యోగం పెరుగుతుంటే వాటిని పట్టించుకోకుండా కీలకమైన రంగాలను అదాని, అంబానీలకు అప్పగించి జమిలి ఎన్నికల జపం చేస్తున్నాడని ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. తొలుత సీతారామ్ ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు వై.వెంకటేశ్వరరావు, షేక్ హనీఫ్, కారుసాల సుబ్బారావమ్మ, పమిడి వెంకట్రావు, కాలం సుబ్బారావు, చీకటి శ్రీనివాసరావు, ఏ.మాల్యాద్రి, స్థానికులు పాల్గొన్నారు.



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు



ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

ఆటో-బైకు ఢీ.. వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో వెంకటేశ్వర్లు

మార్కాపురం: జాతీయ రహదారిపై మార్కాపురం పరిధిలోని బోడపాడు అడ్డ రోడ్డు వద్ద ఆటో, టూవీలర్ ఢీకొన్న సంఘటనలో టూవీలర్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతిచెందాడు. శనివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి మార్కాపురం పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లలచెరువు మండలం మల్లపాలెం గ్రామానికి చెందిన జి.వెంకటేశ్వర్లు (35) తన టూవీలర్‌పై హైవేలో మార్కాపురం రైల్వేస్టేషన్‌వైపు వెళ్తున్నాడు. బోడపాడు అడ్డరోడ్డు వద్దకు రాగానే రైల్వేస్టేషన్ వైపు నుంచి కర్రలు వేసుకుని వచ్చిన ఆటో ఢీకొనడంతో వెంకటేశ్వర్లు కిందపడి గుండె తీవ్ర ఒత్తిడికి గురైంది. ఆటో కూడా బోల్తా పడింది. వెంటనే మార్కాపురం తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేట తీసుకెళ్తుండగా త్రిపురాంతకం వెళ్లేసరికి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు భవానీ మాల వేసుకుని ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీపుత్రుల ఆకలి పోరాటం

- ప్రభుత్వం ఇచ్చిన పొలాల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న బడాబాబులు
- బీళ్లుగా మారిన భూములు
- తిరిగి అడవిలోకి కూడా వెళ్లనివ్వని అటవీ శాఖాధికారులు
- తాము ఎలా బతకాలని ప్రశ్నిస్తున్న గిరిజనులు

గిద్దలూరు రూరల్:

పెద్దల ధనదాహానికి పేదలు బలైపోతున్నారు. అటవీపుత్రులు ఆకలితో అలమటిస్తున్నారు. మండలంలోని దిగువమెట్టతండా పంచాయతీ చెంచుగూడెంలోని గిరిజనులు జీవనోపాధి కోల్పోతున్నారు. ప్రభుత్వ అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన కొందరు పెద్దలు గిరిజనులకు చెందిన భూముల్లోకి అడుగుపెట్టనివ్వకుండా అడ్డుకోవడంతో గిరిజనుల పంట పొలాలు బీడుగా మారాయి. ఆ వివరాల్లోకెళ్తే...



తమ పొలాలకు దారి లేక ఇబ్బందులు పడుతున్న చెంచులు

గిద్దలూరు అభయారణ్య ప్రాంతంలోని మాలకొండపెంటలో పుట్టి అక్కడే నివసిస్తున్న చెంచులను జనజీవనంలోకి తీసుకురావాలనే మంచి ఉద్దేశంతో ప్రభుత్వం 1994-95 మధ్య కాలంలో వారికి దిగువమెట్టతండా సమీపంలో 51 గృహాలు నిర్మించి చెంచు కాలనీ ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి వారు అడవి వదిలి అక్కడే నివాసం ఉంటున్నారు. ప్రభుత్వం వారి జీవనోపాధి నిమిత్తం కొందరికి అటవీశాఖలోనే ఉద్యోగాలిచ్చి బతుకుదెరువు చూపింది. మిగిలిన వారికి 2000-2001 సంవత్సరాల మధ్య కాలంలో 36 మందికి ఒక్కొక్కరికి ఎకరా చొప్పున భూమి పంపిణీ చేసింది. అందుకోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద ఎకరా రూ.36 వేల ప్రకారం 36 ఎకరాలను కొనుగోలు చేసి గిరిజనులకు అప్పగించింది. పంపిణీ చేసిన భూములు వారికి కొన్నాళ్లు పోషణగా మారినప్పటికీ.. 2 సంవత్సరాల క్రితం వారి భూములకు ముందుభాగంలో ఉన్న ప్రభుత్వ భూములను కొందరు రాజకీయ పలుకుబడి కలిగిన వారు కొనుగోలు చేశారు. అప్పటి నుంచి గిరిజనులను వారి భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారు. దీంతో గిరిజనులు పంట పొలాల్లోకి అడుగుపెట్టేందుకు వీల్లేకుండా పోయింది. అటవీ ప్రాంతానికి దగ్గరగా చెంచుగూడెంలో పుట్టి బతుకుదెరువు కోసం సమీపంలోని అడవిలో లభించే తేనె, బంక, అటవీ ఫలాలు, సేకరించి జీవనం కొనసాగించే చెంచుల అభివృద్ధి కోసం వారిని రైతులను చేయాలనే మంచి ఆలోచనతో ప్రభుత్వం భూములు అప్పగించినప్పటికీ కొందరు బడాబాబుల కారణంగా ఫలితం లేకుండా పోయింది.

గిరిజనులు భూముల్లోకి వెళ్లకుండా రెండేళ్ల నుంచి అడ్డగింత...

26 మంది గిరిజనులకు చెందిన భూములకు ముందుభాగంలో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూములు 15 ఎకరాలను బడాబాబులు రెండు సంవత్సరాల క్రితం కొనుగోలు చేశారు. అప్పటి నుంచి గిరిజనులను వారి పొలాల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారు. గిరిజనులు వారి భూముల్లోకి వెళ్లేందుకు వీలులేకపోవడంతో వారి పొలాల్లో చిల్లచెట్లు పెరిగి బీడుగా మారాయి. గిరిజనుల అభివృద్ధి కోసం వారి భూముల్లో వేసిన బోరును కూడా అసైన్డ్ భూమి కొనుగోలుదారులు ఆక్రమించుకుని కంచె ఏర్పాటు చేశారు. బోరులో ఉన్న మోటారు తీసేసి దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారు. సగిలేరువాగు అవతలివైపు ఉన్న 10 ఎకరాల పొలంలోకి వెళ్లేందుకు వాగు అడ్డుగా ఉన్నందున ఆ భూములను కూడా బీడుగానే ఉంచారు. చేసేది లేక బతుకుదెరువు కోసం తిరిగి అడవిలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. అలాగని, ప్రభుత్వం ఇచ్చిన పొలాలు సాగుచేసేందుకు కూడా వీలులేకుండా పోవడంతో తమ బతుకుదెరువు ప్రశ్నార్థకంగా మారిందని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.



చిల్లచెట్లతో నిరుపయోగంగా ఉన్న గిరిజనుల భూములు

ప్రైవేటు వ్యక్తుల వద్ద భూముల కొనుగోలుపై విమర్శలు...

కె.ఎస్.పల్లె రెవెన్యూ పరిధిలో వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ గిరిజనుల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద భూములు ఎందుకు కొనుగోలు చేశారనే దానిపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. 36 మంది గిరిజనుల్లో 26 మందికి 898/2, 896/5, 897/1ఈ, 896/1, 897/1ఏ, 900/4, 901/4, 903, 898, 898/2 సర్వే నంబర్లలో 26 ఎకరాలను ఒకేచోట ఇచ్చారు. మరో 10 మందికి మరో సర్వే నంబరులో సగిలేరువాగు అవతలివైపు 10 ఎకరాల ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. అప్పటి నుంచి గిరిజనులు పొలాలు సాగుచేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నారు.

మా పొలానికి దారి చూపండి :



మా అమ్మ గుజ్జారి వెంకటమ్మ పేరు మీద ఇచ్చిన ఎకరా పొలం సాగు చేసుకునేందుకు వీలు లేకుండా పోయింది. మా అమ్మ చనిపోయింది. ఆమె పేరు మీద ఉన్న పొలాన్ని నా పేరు మీదకు మార్చమని ఎన్నిసార్లు అడిగినా ఎవరూ పట్టించుకోలేదు.

తిరుమలమ్మ

మాకు న్యాయం చేయండి :



ప్రభుత్వం ఇచ్చిన పొలంలోకి అడుగుపెట్టలేకపోవడం వలన బతుకుదెరువు భారంగా మారింది. పొలం సాగుచేసుకునేందుకు వీలులేకపోవడం వలన కూలి పనులకు వెళ్తున్నాం. దగ్గరలో ఉన్న అడవిలోకి వెళ్లేందుకు అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఎవరూ మా సమస్యను పరిష్కరించడం లేదు.

తోట గుంతోడు

అడవిలో ఉన్నప్పుడే బాగున్నాం :



అడవిలో ఉన్నప్పుడే మాకు బాగుంది. ఏదోరకంగా బతికేవాళ్లం. ఇక్కడ మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు. చిన్న సమస్యను కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. మాకు ప్రభుత్వం ఇచ్చిన భూమికి దారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

తోట గురవయ్య

మహిర్ క్షేమం

- కిడ్నాపైన బాలుడు తల్లి ఒడికి..
- నెల్లూరు జిల్లా గుడ్లూరు మామిడితోటల్లో దొరికిన మహిర్
- ఎస్పీ దామోదర్ చేతుల మీదుగా తల్లికి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ దామోదర్, పోలీసులు

ఒంగోలు టౌన్: కిడ్నాపైన బాలుడిని గంటల వ్యవధిలోనే పోలీసులు తల్లి ఒడికి చేర్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆ వివరాలు వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రదీప్ సునాని గత ఐదేళ్లుగా ఒంగోలులోని కార్ కేర్ మెకానిక్ షెడ్డులో పనిచేస్తుంటాడు. కొద్ది నెలల క్రితం నగరంలోని ప్రగతి కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని భార్య ఊర్వశితో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆ దంపతులకు ఇద్దరు సంతానం. మూడు సంవత్సరముల ఒక పాప, 10 నెలల బాబు మహిర్ ఉన్నారు. పక్కింట్లో పనిచేసే దయామణితో ఊర్వశికి పరిచయమైంది. శుక్రవారం సాయంత్రం బాబును చూస్తుండమని దయామణికి చెప్పి ఊర్వశి స్నానానికి వెళ్లింది. తిరిగి వచ్చి చూసే సరికి బాబు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. దయామణి పనిచేసే ఇంట్లో చూడగా, అక్కడ ఆమె దుస్తులు కూడా కనిపించకపోయే సరికి అనుమానం వచ్చింది. వెంటనే ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన ఎస్పీ దామోదర్.. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్, తాలూకా, రూరల్, సింగరాయకొండ సీఐలతో ఐదు బృందాలను నియమించి గాలింపు చర్యలు చేపట్టారు. సోషల్ మీడియాలో చిన్నారి మహిర్ చిత్రాలతో పాటుగా దయామణి, ఆమె సహచరుడు మణికంఠ చిత్రాలను పెట్టి ప్రచారం చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో బాబును తీసుకెళుతున్న సీసీ కెమేరా ఫుటేజీ లభించడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నిందితులను ట్రేస్ చేశారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలోని మామిడి తోటల్లో కిడ్నాప్ చేసిన బాలుడిని ఉంచినట్లు అందిన సమాచారంతో ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మతో వెళ్లి మహిర్‌ను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎస్పీ చేతుల మీదుగా చిన్నారి మహిర్‌ను తల్లిదండ్రులకు అప్పగించారు. కేవలం 6 గంటల వ్యవధిలోనే కిడ్నాప్‌ను ఛేదించడంతో బాలుడి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. బాలుడిని క్షేమంగా తల్లి ఒడికి చేర్చిన పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. బాబు కిడ్నాప్ కేసును ఛేదించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలను ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీ.. వారికి ప్రశంసపత్రాలు అందజేశారు.

పోలీసుల అదుపులో నిందితులు...

బాలుడిని కిడ్నాప్ చేసి విక్రయించాలని ప్రయత్నించిన నిందితులు దయామణి, నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన మణికంఠ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. దయామణికి పెళ్లయి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్తను వదిలేసి కొరియర్‌లో పనిచేసే మణికంఠతో కలిసి సహజీవనం చేస్తోంది. వారిద్దరూ కలిసి బాలుడిని విక్రయించాలనే కుట్రతోనే కిడ్నాప్ చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు తెలిసింది.

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు



గాయాలపాలైన ముసలయ్య

ఒంగోలు టౌన్: వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారి కిందపడి ఓ యువకుడికి గాయాలయ్యాయి. జీపీఆర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు - అమ్మనబ్రోలు మధ్య దిగువ లైనులో పద్మావతి ఎక్స్‌ప్రెస్ నుంచి బత్తుల ముసలయ్య అనే యువకుడు జారి పడ్డాడు. తలకు గాయం కావడంతో వెంటనే జీపీఆర్ పోలీసులు ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అతను తన వివరాలు పూర్తిగా చెప్పలేకపోతున్నాడు. తన పేరు, తండ్రి పేరు మాత్రమే చెబుతున్నాడు. మిగతా వివరాలు తెలియవని చెబుతున్నాడు. అతడి చేతిమీద బత్తుల అఖిల అని రాసి ఉంది. ఎవరికైనా సమాచారం తెలిస్తే ఒంగోలు రైల్వే పోలీసులకు 9440627647 నంబర్‌కు ఫోన్‌చేసి చెప్పాలని జీపీఆర్ ఎస్‌ఐ అరుణకుమారి తెలిపారు.

నేడు గిరిజన కమిషన్ సభ్యుడు రాక

ఒంగోలు వన్‌టౌన్: గిరిజన కమిషన్ సభ్యుడు విడిత్యా శంకర్ నాయక్ ఆదివారం ఒంగోలు రానున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒంగోలు ఆర్అండ్‌బీ అతిథి గృహానికి ఉదయం 9 గంటలకు చేరుకుంటారన్నారు. అనంతరం 11 గంటలకు గిరిజనుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.